## సంక్షిప్త వార్తలు

### • కోటాలో మరో విద్యార్థిని ఆత్మహత్య

కోటా: రాజస్థాన్‌లోని కోటాలో మరో విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నది. నీట్ యూజీ విద్యార్థిని బగీషా తివారీ (18) బుధవారం బలవన్మరణానికి పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. బగీషా తన తల్లి, సోదరునితో కలిసి రాజస్థాన్‌లోని కోటాలో నివసిస్తున్నది. తానుండే అపార్ట్‌మెంట్ తొమ్మిదో అంతస్తుపై నుంచి ఆమె కిందికి దూకినట్లు తెలుస్తున్నది.

### • మా ప్రజాస్వామ్యానికి భారత్ ముప్పు: కెనడా

న్యూఢిల్లీ: తమ ప్రజాస్వామ్యానికి రెండో అతిపెద్ద విదేశీ ముప్పుగా భారతదేశం ఉన్నదని కెనడా ఆరోపించింది. కెనడాలోని ఖలిస్థానీ వేర్పాటువాదులను ఎదుర్కోవడానికి తమ దేశంలో భారత్ జోక్యం పెరుగుతున్నదని ఓ నివేదికలో వెల్లడించింది. ఈ నివేదికలో గతంలో మూడో స్థానంలో ఉన్న భారత్, ఇప్పుడు రెండో స్థానానికి చేరిందని తెలిపింది.

### • పంజాబ్‌లో ఖలిస్థానీ నినాదాలు

న్యూఢిల్లీ: ఆపరేషన్ బ్లూ స్టార్ నిర్వహించి 40 ఏండ్లు అయిన సందర్భంగా పంజాబ్‌లో పలుప్రాంతాల్లో రాడికల్ సిక్కు సంస్థల మద్దతుదారులు ఖలిస్థాన్ అనుకూల నినాదాలు చేశారు. ఖలిస్థాన్ జెండాలను ఎగురవేశారు. స్వర్ణదేవాలయ ప్రాంగణంలోని అకల్ తఖ్త్ వద్ద శిరోమణి అకాలీదళ్ (అమృత్‌సర్)కు చెందిన సిమ్రంజిత్‌సింగ్ మాన్ నేతృత్వంలో వివిధ సంస్థల కార్యకర్తలు నినాదాలు చేశారు.

### • బడిపై ఇజ్రాయెల్ దాడిలో 33 మంది మృతి

గాజా స్ట్రిప్: సెంట్రల్ గాజాలోని ఓ బడిపై గురువారం ఇజ్రాయెల్ దాడి చేయడంతో 33 మంది మరణించారు. వీరిలో 23 మంది మహిళలు, బాలలు ఉన్నారు. ఈ భవనంలో నిర్వాసిత పాలస్తీనియన్లు ఉన్నారని స్థానిక ఆరోగ్య శాఖాధికారులు చెప్తుండగా, హమాస్ ఉగ్రవాదులు ఇక్కడి నుంచే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని ఇజ్రాయెల్ చెప్తున్నది. పాలస్తీనా శరణార్థుల కోసం ఈ పాఠశాలను ఐక్యరాజ్య సమితి నిర్వహిస్తున్నది. హమాస్ ఉగ్రవాదులు గాజా స్ట్రిప్‌లో మళ్లీ ఏకమయ్యారని ఇజ్రాయెల్ తెలిపింది.

### • గ్రామంపై పారామిలిటరీ దళాల దాడి, 100 మంది మృతి

కైరో: సూడాన్‌లోని గెజీరా ప్రావిన్స్‌లో పారామిలిటరీ ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ (ఆర్‌ఎస్‌ఎఫ్) దళాలు విరుచుకుపడ్డాయి. ఈ దళాలు బుధవారం విచక్షణారహితంగా వాడ్ అల్-నౌరా గ్రామంపై దాడి చేసి, విలువైన ఆస్తులను దోచుకున్నాయి. ఈ దాడిలో సుమారు 100 మంది మరణించారు, పదుల సంఖ్యలో సామాన్యులు గాయపడ్డారు. సూడాన్ సైన్యంతో ఓ ఏడాది నుంచి ఈ దళాలు పోరాడుతున్నాయి.

### • సూపర్‌సానిక్ క్షిపణిని పరీక్షించిన అమెరికా

వాషింగ్టన్: అగ్రరాజ్యం అమెరికా అత్యంత అధునాతన ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి మినిట్‌మన్-3ని విజయవంతంగా పరీక్షించింది. కాలిఫోర్నియాలో ఉన్న వాండెన్‌బర్గ్ స్పేస్‌ఫోర్స్ బేస్ నుంచి దీని పరీక్షించింది. ఈ హైపర్‌సానిక్ క్షిపణితో మాస్కోపై కేవలం 30 నిమిషాల్లో దాడిచేయొచ్చని అమెరికా రక్షణ వర్గాలు వెల్లడించాయి. గంటకు 15000 మైళ్ల వేగంతో 4200 మైళ్లు ప్రయాణించి మార్షల్ ఐలాండ్స్‌లోని నిర్దేశిత లక్ష్యాన్ని ఇది ఛేధించినట్టు తెలిపాయి.

# ఈఎంఐ రూపంలో లంచం!

- గుజరాత్‌లో లంచగొండి అధికారుల నయా స్కీమ్
- బాధితులపై ఆర్థిక భారం పడకుండా 'ఉదారత'



వాయిదాల్లో ముడుపులు

అహ్మదాబాద్: వస్తువులు కొనుగోలు, రుణాలకేనా ఈఎంఐలు ఉండేది.. లంచానికి ఉండొద్దా! అనుకున్నారేమో గుజరాత్ అధికారులు.. వెంటనే ఈఎంఐ పథకాన్ని ప్రవేశపెట్టి బాధితులపై ఒకేసారి ఆర్థికభారం పడకుండా 'మంచి మనసు' చాటుకొంటున్నారు. ఎస్జీఎస్టీ బోగస్ బిల్లింగ్ కుంభకోణంలో ఓ వ్యక్తి నుంచి రూ.21 లక్షలు డిమాండ్ చేసిన అధికారులు బాధితుడిపై కరుణాకటాక్షాలు ప్రదర్శించారు. అంతసొమ్ము ఒక్కసారిగా చెల్లించడం కష్టమని భావించి దానిని ఈఎంఐలుగా విభజించి ప్రతి నెలా రూ. 2 లక్షల చొప్పున చెల్లించాలని ఆదేశించారు. మిగిలిన రూ. 3 లక్షలను చివరి మూడు నెలల్లో నెలకు రూ. లక్షల చొప్పున చెల్లించాలని చెప్తూ తమ ఉదారతను చాటుకున్నారు.

ఏప్రిల్ 4న సూరత్‌లోని ఓ గ్రామంలో భూవివాదానికి సంబంధించి డిప్యూటీ సర్పంచ్, తాలూకా పంచాయతీ సభ్యుడు బాధితుడి నుంచి రూ. 85 వేల లంచం డిమాండ్ చేశాడు. అయితే, ఆ తర్వాత అతడి ఆర్థిక పరిస్థితికి కరిగిపోయి ఆ మొత్తాన్ని రూ.35 వేల చొప్పున మూడు ఇన్‌స్టాల్‌మెంట్లుగా విభజించి భారం దించాడు. ఇటీవల ఇద్దరు పోలీసులు రూ. 4 లక్షల లంచంతో పట్టుబడ్డారు. విచారణలో తేలింది ఏంటంటే.. ఆ మొత్తం రూ.10 లక్షల లంచానికి సంబంధించి మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ అని. మరో కేసులో సైబర్ క్రైం పోలీసు రూ. 10 లక్షల లంచాన్ని నాలుగు ఇన్‌స్టాల్‌మెంట్లుగా విభజించాడు. ఇలాంటి లంచం ఇన్‌స్టాల్‌మెంట్ కేసులు ఈ ఏడాది విపరీతంగా పెరిగినట్టు ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. కేసు విషయంలో పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కినా, ప్రభుత్వ పథకం కోసం కార్యాలయాలకు వెళ్లినా సామాన్యుడి నుంచి ముక్కుపిండి మరీ లంచం వసూలు చేస్తున్నారు. చెల్లించుకోలేని పరిస్థితుల్లో ఉన్నవారికి ఇలాంటి స్కీములు ఆఫర్ చేస్తున్నారని గుజరాత్ ఏసీబీ డైరెక్టర్ శంషేర్‌సింగ్ తెలిపారు. బాధితులు కొందరు కొంతమొత్తాన్ని చెల్లించిన తర్వాత మాత్రమే తమను ఆశ్రయిస్తున్నట్టు తెలిపారు.

**దేశవ్యాప్తంగా చర్చ**

గుజరాత్ వాటర్ సప్లై, సీవరేజ్ బోర్డులోని క్లాస్ 2 అధికారి ఒకరు ఓ కాంట్రాక్టర్ ఇన్వాయిస్‌లు క్లియర్ చేసేందుకు రూ. 1.2 లక్షలు డిమాండ్ చేసి దానిని నెలకు రూ. 30 వేల చొప్పున నాలుగు ఇన్‌స్టాల్‌మెంట్లుగా విభజించాడు. అవినీతి అధికారుల ఇన్‌స్టాల్‌మెంట్ల వ్యవహారం ఇప్పుడు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమవుతున్నది.

## ఎస్టీ కార్పొరేషన్ స్కామ్..
# కర్ణాటక మంత్రి రాజీనామా

- అధికారి సూసైడ్ నోట్‌తో బయటపడ్డ అవినీతి బాగోతం
- ఎస్టీ కార్పొరేషన్‌లో 187 కోట్ల నిధులు మళ్లింపు



న్యూఢిల్లీ: కర్ణాటకలో ఎస్టీ కార్పొరేషన్ స్కామ్ కాంగ్రెస్ సర్కారు మెడకు చుట్టుకున్నది. మంత్రి బీ నాగేంద్ర గురువారం తన పదవికి రాజీనామా చేశారు. కర్ణాటక మహర్షి వాల్మీకి షెడ్యూల్ ట్రైబ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో మనీ లాండరింగ్ జరిగిందన్న విషయం ఆ సంస్థ అకౌంట్స్ అధికారి మే 26న ఆత్మహత్య చేసుకోవడంతో వెలుగులోకి వచ్చింది. సూసైడ్ నోట్‌లో అతడు పేర్కొన్న వివరాల ప్రకారం.. రూ.187 కోట్ల ఎస్టీ కార్పొరేషన్ నిధులు అనధికారిక బ్యాంక్ ఖాతాలకు బదిలీ అయ్యాయి. ఈ కార్పొరేషన్ నాగేంద్ర పర్యవేక్షణలోని శాఖ కిందకు వస్తుంది. ఈ మొత్తంలో రూ.88.62 కోట్లు హైదరాబాద్‌లోని ప్రముఖ ఐటీ కంపెనీల ఖాతాలకు చట్టవిరుద్ధంగా బదిలీ అయ్యాయి. ఈ వ్యవహారంపై యూనియన్ బ్యాంక్ సీబీఐకి ఫిర్యాదు చేయడంతో విచారణ కొనసాగుతున్నది. మరోవైపు కర్ణాటక సర్కారు కూడా ఈ అవినీతి బాగోతంపై సిట్ విచారణ చేస్తున్నది.

## బర్డ్ ఫ్లూతో తొలి మరణం

**మెక్సికోలో వ్యక్తి మృతి**

మెక్సికో సిటీ: మనుషుల్లో ముందెన్నడూ కనిపించని హెచ్5ఎన్2 బర్డ్‌ఫ్లూ వైరస్ వల్ల ఓ మెక్సికో దేశస్థుడు మరణించాడని బుధవారం ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ప్రకటించింది. ఏప్రిల్ 24న అతడు దవాఖానలో అనారోగ్యంతో చనిపోయాడని.. ఆ వ్యక్తికి ఆ వైరస్ ఎలా సోకిందో తెలియదని వెల్లడించలేదు. ఒక పౌల్ట్రీ ద్వారా అది వ్యాపించి ఉండొచ్చని తెలిపింది. మనిషి ద్వారా వ్యాపించడం వల్లే సదరు వ్యక్తి మరణించాడనడానికి ఆధారాలు లేవని మెక్సికో వైద్యశాఖ పేర్కొంది. మనుషుల్లో ఈ వైరస్ వ్యాప్తి జరగకుండా శాస్త్రవేత్తలు అప్రమత్తమయ్యారు. మెక్సికోలో మార్చిలోనే బర్డ్ ఫ్లూ కేసులను గుర్తించారు.

## జననాల రేటు పెంచేందుకు జపాన్‌లో డేటింగ్ యాప్


టోక్యో, జూన్ 6: జపాన్‌లో జనాభా సంక్షోభం ప్రభుత్వాన్ని కలవరపరుస్తున్నది. పెండ్లి చేసుకునేందుకు, పిల్లల్ని కనేందుకు యువత ఆసక్తి కనబరచడం లేదు. దీంతో జననాల రేటు పెంచేందుకు ప్రభుత్వం చర్యలకు దిగింది. ఇప్పటికే ప్రేమికుల కోసం సలహాలు, సాధారణ సమాచారాన్ని అందించేందుకు ఆన్‌లైన్ వెబ్‌సైట్ ఉండగా, ఇప్పుడు కొత్తగా టోక్యో సిటీ హాల్ డేటింగ్ యాప్‌ను కూడా అభివృద్ధి చేస్తున్నది. దీనిని ఈ ఏడాది చివరినాటికి అందుబాటులో తేవాలని యోచిస్తున్నారు. ఫోన్, లేదా వెబ్ ద్వారా ఈ వెబ్‌సైట్‌తో ఈ యాప్‌కు అనుసంధానం కావచ్చు. సింగిల్‌గా ఉన్నవారు తమకు నచ్చిన వారిని కలిసేందుకు ఈ యాప్ దోహదపడుతుంది.






# నీట్‌లో అక్రమాలపై ఆందోళన

- ఏకంగా 67 మందికి టాప్ ర్యాంకు
- వీరిలో ఆరుగురుది ఒకే ఎగ్జామ్ సెంటర్
- మళ్లీ పరీక్షలు నిర్వహించాలని అభ్యర్థుల డిమాండ్



న్యూఢిల్లీ: వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ పరీక్షలో అక్రమాలు జరిగాయని పలు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. మళ్లీ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. రికార్డు స్థాయిలో ఏకంగా 67 మందికి టాప్ ర్యాంకు వచ్చిందని, వీరిలో ఆరుగురు ఒకే ఎగ్జామ్ సెంటర్‌కు చెందిన వారని వారు ఆరోపిస్తున్నారు. అయితే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఈ ఆరోపణలను ఖండించింది. ఎన్సీఈఆర్టీ టెక్స్ట్ బుక్స్‌లో చేసిన మార్పులు, ఎగ్జామినేషన్ సెంటర్‌లో పరీక్ష సమయాన్ని కోల్పోయినందుకు గ్రేస్ మార్కులు కేటాయించడం వల్ల విద్యార్థులు స్కోర్ పెరిగిందని పేర్కొన్నది. బుధవారం సాయంత్రం నీట్ ఫలితాలు వెలువడిన సంగతి తెలిసిందే. మొత్తం 67 మందికి టాప్ ర్యాంకు వచ్చింది. వీరిలో హర్యానాలో ఒకే సెంటర్‌కు చెందిన ఆరుగురు ఉన్నారు.

## థియరీ, ప్రాక్టికల్ మార్కుల్లో మతలబు

- రెండింటి మధ్య భారీ వ్యత్యాసం
- ఏఐ టూల్స్ విశ్లేషణలో వెల్లడి
- దీనిపై దృష్టి సారించాలన్న సీబీఎస్‌ఈ



న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా ఉన్న స్కూళ్లలో విద్యార్థులకు థియరీ పరీక్షలకు, ప్రాక్టికల్ పరీక్షల్లో వచ్చిన మార్కుల్లో గణనీయమైన తేడా ఉండటం పట్ల సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) ఆందోళన వ్యక్తం చేసింది. గత ఏడాది విద్యార్థులు సాధించిన ఫలితాలు కృత్రిమ మేధ(ఏఐ) ద్వారా విశ్లేషించిన తర్వాత 500కు పైగా స్కూళ్లలో 50 శాతం విద్యార్థుల థియరీ, ప్రాక్టికల్స్ మార్కుల మధ్య ఎక్కువ తేడా ఉండటాన్ని గమనించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం అమలు చేస్తున్న బోధనా విధానాన్ని ఆయా స్కూళ్లు సమీక్షించుకోవాలని సీబీఎస్‌ఈ అడ్వైజరీ జారీ చేసింది. ప్రాక్టికల్స్‌లో స్కూల్ యాజమాన్యాలు మరింత అప్రమత్తత, శ్రద్ధ పెట్టాల్సిన అవసరాన్ని తమ పరిశోధన నొక్కి చెప్పిందన్నారు. థియరీ పరీక్షలకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో ప్రాక్టికల్స్‌పైన అంతే శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందని సీబీఎస్‌ఈ పేర్కొంది.






## కార్యకర్తలకు అండగా ఉంటాం



మద్దిగట్లలో కల్యాణమండప నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి
- కల్యాణ మండప నిర్మాణ పనుల పరిశీలన
- బీఆర్‌ఎస్ మళ్లీ పుంజుకుంటుంది

పెద్దమందడి, జూన్ 6 : పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి భరోసా కల్పించారు. మండలంలోని మద్దిగట్ల గ్రామంలోని వేంకటేశ్వరస్వామి గుడి ఆవరణలో మాజీ మంత్రి తన తల్లి కీర్తిశేషులు తారకమ్మ పేరుమీద నిర్మిస్తున్న కల్యాణ మండప నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్యాణ మండప నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. రాజకీయాలలో గెలుపోటములు సహజమేనన్నారు. పార్టీ శ్రేణులు అధైర్యపడొద్దని, కాంగ్రెస్ పార్టీకి ఇప్పటికే ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని త్వరలో బీఆర్‌ఎస్ పార్టీ పుంజుకుంటుందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీపీఎం తీరుతో ఇబ్బందులు

• పోస్టాఫీస్ ఎదుట ఉపాధి కూలీల ఆందోళన

గట్టు, జూన్ 6 : ఉపాధిహామీ కూలీలు పనులు చేసినా వారికి సకాలంలో వేతనాలు అందడంలేదని ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద ఆరోపించారు. స్థానిక పోస్టాఫీస్ వద్ద ఆమె కూలీలతో కలిసి గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నర్మద మాట్లాడుతూ కూలీలు ఎన్ని డాక్యుమెంట్లు తెచ్చినా బీపీఎం ఏదో ఒకసాకు పెడుతూ కూలీలకు వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతుందన్నారు. ఈవిషయంలో పోస్టల్ ఉన్నతాధికారులు స్పందించి గట్టు ఉపాధి కూలీలకు సకాలంలో కూలిడబ్బులు అందేవిధంగా చూడాలని ఆమె కోరారు.



గట్టులో పోస్టాఫీస్ వద్ద ఉపాధి కూలీలతో ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద

## అడవినుంచి తప్పిపోయిన చుక్కల దుప్పి



చుక్కల దుప్పిని అడవిలో వదిలిపెడుతున్న అటవీశాఖ సిబ్బంది

- బంధించిన బీకే తిర్మలాపూర్ గ్రామస్తులు
- అడవిలోకి సురక్షితంగా చేర్చిన అటవీశాఖ అధికారులు

అమ్రాబాద్, జూన్ 6 : అమ్రాబాద్ టైగర్ రిజర్వు నుంచి తప్పిపోయిన చుక్కల దుప్పి గురువారం మండలంలోని బీకె తిర్మలాపూర్ గ్రామంలోని ఒక ఇంటిలో చొరబడింది. ఇది గమనించిన గ్రామస్తులు చుక్కల దుప్పిని ఇంటిలోనే బంధించి అటవీశాఖ అధికారులకు సమాచారాన్ని అందించినట్లు అటవీశాఖ క్షేత్ర అధికారి ఆదిత్య తెలిపారు. సమాచారం అందిన వెంటనే రెస్క్యూటీమ్ సిబ్బందితో బీకె తిర్మలాపూర్ గ్రామానికి చేరుకొని చుక్కల దుప్పి కళ్లు మూసివేసి బంధించి వెటర్నరీ వైద్యుడు అనిల్ చికిత్స చేసిన అనంతరం రికవరీ వాహనంలో తీసుకెళ్లి అడవిలో సురక్షితంగా వదిలిపెట్టారు. అడవినుంచి తప్పిపోయి వచ్చిన చుక్కల దుప్పికి ఎలాంటిహాని తలపెట్టకుండా అటవీశాఖ అధికారులకు సమాచారం అందించినందుకు గ్రామస్తులకు అటవీ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

## సీసీ రోడ్లెప్పుడేస్తారు..?

• నాగర్‌కర్నూల్‌లో వాననీటిలో కూర్చొని బీజేపీ కార్యకర్త నిరసన



బీసీకాలనీలో వర్షపు నీటిలో కూర్చొని నిరసన తెలుపుతున్న బీజేపీ కార్యకర్త, కాలనీవాసులు

నాగర్‌కర్నూల్, జూన్ 6 : తమ కాలనీకి సీసీ రోడ్డు వేయాలని డిమాండ్ చేస్తూ రహదారిపై నిలిచిన వర్షపు నీటిలో కూర్చొని బీజేపీ కార్యకర్త నిరసన వ్యక్తం చేశారు. గురువారం తెల్లవారుజామున నాగర్‌కర్నూల్ పట్టణంలోని 17వ వార్డులోని బీసీ కాలనీలో కురిసిన వర్షానికి రోడ్లపై ఎక్కడికక్కడ నీళ్లు నిలిచాయి. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వేసినా సీసీ వేయకపోవడంతో మట్టికుంగడంతో నీళ్లు ఆగాయి. దీంతో స్థానికుల రాకపోకలు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. బీసీ కాలనీలోని అన్ని వీధుల్లో ఇదే పరిస్థితి నెలకొనగా.. అదేకాలనీకి చెందిన బీజేపీ బూత్ అధ్యక్షుడు బాలరాజు కాలనీ వాసులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. సీసీరోడ్డు వేయించాలని ప్రస్తుత ఎమ్మెల్యేకు పలుమార్లు విన్నవించినా ఫలితంలేదని, అంబులెన్స్ వచ్చేందుకు కూడా రోడ్డు సక్కగా లేదన్నారు. వర్షం నీరు గుడిసెల్లోకి చేరుతున్నాయని చెప్పినా అధికారులు ఎన్నికల తర్వాత అంటూ దాటవేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రోడ్డు పనులు చేపట్టకపోతే ఆందోళన చేస్తామని కాలనీవాసులు హెచ్చరించారు.

# ప్రతి అభివృద్ధి పనికి 'మేఘా'ట్యాక్స్

- ఎమ్మెల్యేకు 8శాతం కమిషన్
- మీడియా సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్
- ఇంటిపోరును ఇతరులపై రుద్దడం మానుకోవాలి
- అభివృద్ధిలో చరిత్ర సృష్టించిన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు గట్టుయాదవ్

వనపర్తి, జూన్ 6 : నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేయాలంటే కాంట్రాక్టర్లు మేఘా ట్యాక్స్ పేరిట ఎమ్మెల్యే మేఘారెడ్డికి 8శాతం కమిషన్ అందజేయాల్సిందేనని డిమాండ్ చేస్తున్నట్లు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు పలుస రమేశ్ గౌడ్‌లతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజక వర్గంలో అభివృద్ధి పనులకు తనకు 8శాతం పర్సంటేజ్ ముట్టజెప్పాలని కాంట్రాక్టర్లకు ఎమ్మె ల్యే హుకుం జారీ చేస్తున్నట్లు కొంతమంది కాంట్రాక్టర్లు తమతో విన్నవించుకున్నారని తెలిపారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి రాజకీయాల్లో హుందాతనాన్ని కాపాడాలని, ఇంటి పోరును ఇతరులపై రుద్దడం మానుకోవాలని హితవు పలికారు. ప్రతిరాజకీయ పార్టీకి సిద్ధాంతలు ఉంటాయని, అది మొదటి నుంచి ఆ పార్టీలో ఉన్న వారికి మాత్రమే తెలుస్తుందని, పూటకో పార్టీ మారే వారికి సిద్ధాంతాలు ఎలా తెలుస్తాయని ఎద్దేవా చేశారు.

సొంత పార్టీలోని సీనియర్ నాయకులను ద్రోహులుగా చిత్రీకరించడంలో మీరు అందేవేసివారన్నారు. నియోజకవర్గంలో కొన్ని అల్లరిమూకలను జత చేసుకొని మాజీ మంత్రిని విమర్శిస్తే రానున్న రోజుల్లో తీవ్ర ప్రతిఘటనలను ఎదుర్కొవాల్సి వస్తుందని హెచ్చరించారు. మైక్ పట్టుకుంటే చాలు బూతులు మా ట్లాడం తప్ప మరొకటి లేదన్నారు. మాజీ మంత్రిని విమర్శించడం, లేదంటే కర్రు కాల్చి వాత పెడుతా, బొందపెడుతా, పాతిపెడుతా అని ఊత పదాలతో మభ్యపెడుతున్నారని విమర్శించారు.

చిన్నారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిలకు మించిన అభివృద్ధి నిరంజన్‌రెడ్డి చేసి చరిత్ర సృష్టించి, భావితరాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. వీరికంటే మరింత అభివృద్ధి చేసి చూపించాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్కెఫైడ్ డైరెక్టర్ విజయ్‌కుమార్, మీడియా కన్వీనర్ అశోక్, మాజీ కౌన్సిలర్ ఉంగ్లం తిరుమల్, ప్యాట తిరుపతయ్య శ్రీను పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 6 : నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతకుమారి స్పష్టం చేశారు. గురువారం సమీకృత కలెక్టరేట్‌లో కలెక్టర్ రవినాయక్, అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. నకిలీ విత్తనాల కట్టడికి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు.

## గ్రూప్-1 పరీక్షలకు ఏర్పాట్లు చేపట్టాలి

• అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్

నాగర్‌కర్నూల్, జూన్ 6 : జిల్లాలో గ్రూప్-1 పరీక్షకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో రీజినల్ కోఆర్డినేటర్ మధుసూదన్‌శర్మతో కలిసి పరీక్ష నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్, రూట్ ఆఫీసర్స్, ఫ్లైయింగ్ స్క్వాడ్స్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్స్, అబ్జర్వర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పరీక్షకు ఏర్పాట్లు, నిర్వహణ చర్యల గురించి వివరించారు.

## ఆర్డీఎస్‌కు స్వల్పంగా వరద

అయిజ, జూన్ 6 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు వరద స్వల్పంగా కొనసాగుతున్నది. ఎగువన కురిసిన వానలకు గురువారం 4,329 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, అవుట్ ఫ్లో 4,329 క్యూసెక్కులు సుంకేసుల బ్యారేజీకి చేరుతోందని ఆర్డీఎస్ ఏఈ తెలిపారు. ప్రస్తుతం 8.6 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు పేర్కొన్నారు.

**తుంగభద్ర డ్యాంకు..**

కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరుగుతున్నది. గురువారం ఇన్‌ఫ్లో 1,581 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 10క్యూసెక్కులుగా నమోదైంది. టీబీ డ్యాం 100.855 గరిష్ఠ నీటినిల్వ సామర్థ్యానికి, ప్రస్తుతం 3.631 టీఎంసీల నీటినిల్వ ఉన్నది.